క్లుప్తంగా

పొదలకూరు ఏఓగా ప్రతాప్


ప్రతాప్

పొదలకూరు: మండల వ్యవసాయాధికారిగా వి.ప్రతాప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కలువాయి ఏఓగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికొచ్చారు. కాగా ఇక్కడ ఏఓగా సుదీర్ఘకాలం పనిచేసిన ఎ.వాసు వింజమూరుకు బదిలీ అయ్యారు. వాసు ఐదు సంవత్సరాలకు పైగా రైతులకు సేవలందించారు.

అగ్రిల్యాబ్ ఏఓ బదిలీ

స్థానిక నిమ్మమార్కెట్ యార్డులో ఉన్న అగ్రికల్చర్ ల్యాబ్ ఏఓ శ్రీదేవి నెల్లూరు ఏడీఏ కార్యాలయానికి సాధారణ బదిలీల్లో భాగంగా వెళ్లారు. ఇక్కడి ల్యాబ్‌కు జ్యోత్స్న బదిలీపై వచ్చారు.

వేడుకగా పగటి ఉత్సవం



కొడవలూరు: స్థానిక దళితవాడలో కొలువైన ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పగటి ఉత్సవం గురువారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులు స్వామివారిని మోసుకొంటూ గ్రామ వీధుల్లో ఊరేగింపు చేశారు. భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. అర్చకుడు పవన్ స్వామి పూజా కార్యక్రమాలు జరిపించారు.

ప్రశంసాపత్రం అందజేత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి చెందిన ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ గురువారం పర్యావరణ ప్రశంసాపత్రం అందుకున్నారు. గుజరాత్‌లోని పీపీ సవాని విశ్వవిద్యాలయం వారు ఇక్కడి ఉపాధ్యాయుడి సేవలను గుర్తించి ఆన్‌లైన్ ద్వారా ప్రశంసాపత్రం పంపించారు. ఎంపీడీఓ శ్రీహరి దీనిని సుధీర్‌కుమార్‌కు అందజేసి అభినందనలు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన వ్యక్తులకు సంబంధించి వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించారు. దానికి సంబంధించిన నియామక ఉత్తర్వులను గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిరిమానోత్సవం

- అట్టహాసంగా చాముండేశ్వరి బ్రహ్మోత్సవాలు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు


వేడుకగా జరుగుతున్న రథోత్సవం

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరి దేవస్థానంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో అత్యంత ప్రధానమైన సిరిమానోత్సవం (రథోత్సవం) గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి నామస్మరణలతో రథాన్ని గ్రామంలోని ప్రధాన కూడలి నుంచి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. సిరిమానును లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. అమ్మవారికి ప్రత్యేక పూలంగి సేవ జరిగింది. ఆలయ అర్చకులు నూతలపాటి అనిల్‌కుమార్ శర్మ, మాచవోలు రామకృష్ణ, ముప్పిరాల కిశోర్, యాజ్ఞికులు మన్నూరు మల్లికార్జున గురుకుల్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. తమ ఇష్టదైవం చాముండేశ్వరీదేవిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. పూలంగిసేవకు ఉభయకర్తలుగా స్థానికులు కొండూరు అనిల్‌కుమార్‌రెడ్డి- అనూష దంపతులు వ్యవహరించారు. స్థానిక విష్ణుష్ యూత్ భారీ ప్రసాద వితరణ చేశారు. తొలుత ఉదయం తీర్థవాది సముద్ర స్నానం శాస్త్రోక్తంగా జరిగింది. సంప్రదాయం ప్రకారం అమ్మవారిని ఆలయం నుంచి సమీపాన ఉన్న సముద్రం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పుష్పాలంకరణతో తిరిగి తీసుకొచ్చారు. భక్తులు అమ్మవారి వెంట జేజేలు పలుకుతూ తీరం చేరుకొని సముద్ర స్నానాలు ఆచరించారు. తీర్థవాది స్నానానికి 'అమ్మ హేచరీ' అధినేత దుగ్గా శంకర్‌రెడ్డి, శివారెడ్డి, ఎస్.సత్తిబాబు ప్రసాదాలను అందజేశారు.

భక్తుల కోలాహలం

రథోత్సవం (సిరిమానోత్సవం)ను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం వేకువజాము వరకు భక్తుల తాకిడి కొనసాగింది. దీంతో గ్రామంలోని వీధులు, రహదారులు కిటకిటలాడాయి. గంగపట్నం- నెల్లూరు ప్రధాన రహదారి వాహన రాకపోకలతో రద్దీగా మారింది. రథోత్సవం అనంతరం అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

భారీ బందోబస్తు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం లేకుండా సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు

నేడు తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో చివరిదైన తెప్పోత్సవం శుక్రవారం రాత్రి జరుగనుంది. ఆలయం వెనుక వైపు ఉన్న కోనేరులో జరిగే కార్యక్రమానికి ఆలయ పాలకవర్గం, సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి వేధిస్తారా?


మనుబోలు: వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నాయకులతో పూజిత

- నాన్న కడిగిన ముత్యంలా బయటికొస్తారు
- కాకాణి పూజిత

మనుబోలు: ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధించడమే కూటమి ప్రభుత్వ విధానంగా మారిందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత అన్నారు. గురువారం మనుబోలు మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న దుర్మార్గపు విధానాలను ప్రశ్నించిన తన తండ్రి కాకాణిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేశారన్నారు. కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటామన్నారు. తమ పార్టీ వారిని ఇబ్బంది పెడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. కోర్టులపై నమ్మకం ఉందని కాకాణి కడిగిన ముత్యంలా బయటికొస్తారని ధీమా వ్యక్తం చేశారు. తప్పులను ఎత్తిచూపుతున్న జర్నలిస్టులను సైతం వదలడం లేదన్నారు. ఇందుకు సీనియర్ జర్నలిస్ట్ కేఎస్ఆర్ అరెస్ట్, కావలిలో విలేకరులపై కేసులే నిదర్శనమన్నారు. ప్రజలే కూటమి ప్రభుత్వంపై తిరగబడే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. ఆమె స్థానిక సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచ్ కంచి పద్మ మ్మ, ఎంపీటీసీ సభ్యురాలు దువ్వూరు రాజేశ్వరమ్మ, నాయకులు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, గుంజి రమేష్, దాసరి భాస్కర్‌గౌడ్, గిద్దంటి రమణయ్య, ఏలూరు భాస్కర్‌రెడ్డి, చలగల దయాకర్, గిరి, పార్థు, కోటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న పూజిత

⇨ వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి, తాటిపర్తిపాళెం, తిరుమలమ్మపాళెం గ్రామాల్లో కాకాణి పూజిత పర్యటించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను, వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, ఎంపీటీసీ వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, డక్కిలి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన


కొడవలూరులో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీలు


కొడవలూరు: వినాయక నగర్ గిరిజన కాలనీలో..

కొడవలూరు: ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా కొడవలూరు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని విధిగా అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. ఇక్కడ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించడంతో పాటు పోషకాహారం ఇస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రమీజా, యాస్మిన్, నాగరాజమ్మ, శాంతి పాల్గొన్నారు.

⇨ నార్తురాజుపాళెంలోని వినాయక నగర్ గిరిజన కాలనీలో గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపడం వల్ల పోషకాహారం అందించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిస్తామన్నారు. అనంతరం పిల్లలకు బాలామృతం కిట్‌లను పంపిణీ చేశారు. సుహాని ఫౌండేషన్ వారు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వై.రాజమ్మ, ఎస్.సుదర్శన, ఆర్.సునీత, హెల్పర్ టి.ప్రసన్న పాల్గొన్నారు.


ఇందుకూరుపేట : చిన్నారులకు అక్షరాభ్యాసం

⇨ ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు, నరసాపురం, కొరుటూరు, గంగపట్నంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.మంజుల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

విడవలూరు: గ్రామానికి తాగునీటిని వదిలేందుకు వ్యక్తిని నియమించుకునే విషయంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన మండలంలోని ఊటుకూరు పెద్దపాళెం పంచాయతీ వెంకటరెడ్డిపాళెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వెంకటరెడ్డిపాళెంలో గురువారం ఉదయం గ్రామస్తులంతా కలిసి వారికి తాగునీటిని వదిలేందుకు వ్యక్తిని నియమించుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే గ్రామంలోని పాపింగారి బాలకృష్ణ, సీతారామయ్య, పామంజి సునీల్, పామంజి బాలసుబ్రహ్మణ్యం, చింతంగారి లక్ష్మణ్, రాంబాబు, భక్తాని రాధాకృష్ణ, అలారి సుబ్రహ్మణ్యం కలిసి వారి వర్గానికి చెందిన వ్యక్తినే నీరు వదిలేందుకు నియమించాలని చెప్పడంతో అదే గ్రామానికి చెందిన మరో వర్గానికి చెందిన కోడి బ్రహ్మయ్య, ప్రసాద్, మేకల రాము, కిశోర్, రాములు, అక్కయ్యగారి యానాదయ్య, ఆవుల చిన్న, నరసింహ తమ వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాలంటూ పట్టుబట్టడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. కొద్దిసేపటికి గొడవకు దారితీసి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లు, గాజు సీసాలతో దాడి చేసుకున్నారు. దీంతో గ్రామంలోని ప్రజలు భయాందోళనతో నివాసాల్లోకి పరుగులు తీశారు. ఈ ఘటనపై స్థానిక వీఆర్వో చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలియజేశారు.

బాబా మందిరంలో పూజలు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకి సేవ నిర్వహించారు.

నిమ్మ తోటల సందర్శన



పొదలకూరు: వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమ్మవారిపాళెంలో గురువారం నిమ్మతోటలను వెంకటగిరి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ డి.తిరుపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. నిమ్మలో పూత నియంత్రణ పద్ధతులు పాటిస్తే వేసవిలో రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా పొదలకూరు ఉద్యానాధికారి ఈ.ఆనంద్ ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందుతున్న పలు పథకాల గురించి వివరించారు. సూక్ష్మ పోషకాలు, వివిధ రకాల తెగుళ్ల నివారణ తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, వీఏఏ అజయ్‌కుమార్, వీఆర్వో శారద తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



పొదలకూరు: మండలంలోని విరువూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ గురువారం పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా సరస్వతి పూజ కార్యక్రమాన్ని చేశారు. పిల్లల చేత అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో పిల్లల సంఖ్యను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంఎస్‌కే రూప, స్కూల్ టీచర్లు కల్యాణి, అనూరాధ, అంగన్‌వాడీ టీచర్లు మాధురి, గాయత్రి, శ్రీలక్ష్మి, శీనమ్మ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం

పొదలకూరు: మండలంలోని 104 జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజున విద్యార్థులు ఎక్కువ హాజరుకాలేదు. మంచిరోజు చూసుకుని వస్తారని ఉపాధ్యాయులు వెల్లడించారు. మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 5,133 మంది పిల్లలున్నారు. ఈ విద్యాసంవత్సరం టెక్స్‌బుక్స్, నోట్‌బుక్స్ పూర్తి స్థాయిలో దిగుమతి అయినట్టు ఎంఈఓ - 2 శోభనాద్రి తెలిపారు. తొలిరోజున కొన్ని పాఠశాలల్లో పుస్తకాలను విద్యార్థులకు అందజేయడం జరిగిందన్నారు. కిట్స్ మరో వారంరోజుల్లో అందజేస్తామన్నారు. యూనిఫాం, షూస్ రావాల్సి ఉందన్నారు.

దొంగలుగా చిత్రీకరిస్తే సహించం



మాట్లాడుతున్న నల్లగొండ శివ

నెల్లూరురూరల్: ఎరుకల సంఘీయులను దొంగలుగా చిత్రీకరిస్తే సహించేది లేదని ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శివ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో 800 కాలనీల్లో ఎరుకల వారు నివసిస్తున్నారన్నారు. కాగా అల్లూరు, బిట్రగుంట, కావలిలో కొన్ని ఎరుకల కాలనీలను సెటిల్మెంట్ల ఏరియా అని దొంగలుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. మాపై దుష్ప్రచారం చేస్తూ సమాజంలో వివక్షకు గురి చేస్తున్నారన్నారు. దీనివల్ల పుట్టబోయే బిడ్డలు ప్రభావితం అవుతున్నారన్నారు. అవసరమైతే కించపరిచిన వారిపై అట్రాసిటీ కేసులు పెడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా చైర్మన్ కట్ట రామారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి బుజ్జయ్య, గౌరవాధ్యక్షుడు కట్ట రమణయ్య, జిల్లా జాయింట్ సెక్రటరీ కంప శ్యామ్, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ్ల వెంకయ్య, జిల్లా జాయింట్ సెక్రటరీ నాగరాజు, రజిని పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

నెల్లూరు సిటీ: నెల్లూరు నుంచి పలు ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు డిపో-1 మేనేజర్ మురళీకృష్ణకు విన్నవించుకున్నారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో డయల్ యువర్ డీఎం-1 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీనగర్‌కు చెందిన శర్మ పొట్టిశ్రీరాములు బస్‌స్టేషన్ నుంచి మినీబైపాస్ రోడ్డు మీదుగా సుందరయ్య కాలనీ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మూలాపేటకు చెందిన అంకయ్య నెల్లూరు నుంచి రైల్వే కోడూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. రామయ్యపాళేనికి చెందిన సాగర్ రామన్నపాళెం ఎక్స్‌రోడ్డు, కోవూరు సాయిబాబా మందిరం వద్ద బస్సులు ఫ్లై ఓవర్ కింద నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై డిపో మేనేజర్ మురళీకృష్ణ సమాధానం ఇస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు.



బడి గంట మోగింది


పిల్లాడిని స్కూల్‌కు తీసుకెళ్తూ..

వేసవి సెలవులు ముగిశాయి. బడి గంట మోగింది. గురువారం అన్ని యాజమాన్యాల పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల్ని స్కూళ్లలో చేర్పించారు. ప్రైవేట్ పాఠశాలలు చాలానే ఉన్నాయి. తల్లిదండ్రులు ఫీజులను లెక్కచేయకుండా వాటిల్లో పిల్లల్ని చేర్పిస్తున్నారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో ఇక్కడి ప్రైవేట్ పాఠశాలల్లో ర్యాంకుల పంట పండింది. పిల్లల్ని నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియం చదివించేందుకు మెజార్టీ శాతం పేరెంట్స్ ఇష్టపడుతున్నారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులతో కళకళాడుతున్నాయి. ఆయా యాజమాన్యాలు సైతం తమ బడుల్లో ఆట వస్తువులతోపాటు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తూ విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. తాజాగా స్కూళ్లు మొదలైన నేపథ్యంలో యూనిఫారంతోపాటు పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ విక్రయించే దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.